12_NOV_2023_F_SUNMAG 796 Real 11/08/2023 10:04 PM Page 17

లోనూ.. కృష్ణారావును పోల్చుకొని చూడటం అల వాటైంది శివానందానికి.

స్వర్గధామం రథం పెద్ద చప్పుళ్లతో గేటు వరకూ రావడంతో.. శివానందం ఆలోచనలకు బ్రేక్ పడింది. దానికి ముందు కారులో వచ్చిన వెంకట్రావు, కారు దిగి.. సరాసరి ఆఫీసు గదిలోకి వచ్చాడు.

''అలా కూర్చోండి సార్! ఇప్పటికే ఒకటి, మూడో ప్లాట్‌ఫాంలలో శవాలు కాలుతున్నాయి. మీరు ఒక గంట ఓపిక పట్టారంటే.. ఆ చివరి ప్లాట్‌ఫాంలో మీ తాలూకు శవాన్ని కాల్చవచ్చు. లేదంటే.. ఆ మంటలు – సెగలు – పొగలు మీకు ఇబ్బంది కలిగిస్తాయి'' అంటూ విన యంగా చెప్పి, ఆయన్ని కూర్చోపెట్టాడు.

''ఏమో శివానందం! ఈ వృద్ధాప్యంలో శ్మశానంలోకి రావాలంటే, నాకు కొంత భయంగానే ఉంది. కానీ ఏం చేద్దాం. చనిపోయిన ఆమెకు కొడుకు విదేశాల్లో ఉండి రాలేకపోయాడు. అమ్మ దహన క్రియలన్నిటినీ దగ్గరుండి వేదోక్తంగా జరిపించమని వేడుకున్నాడు. కాదనలేకపోయాను'' అంటూ విషయం చెప్పాడు.

ఈ మాట విన్న శివానందం కళ్లు మెరిశాయి.

''కొద్దిరోజుల క్రితం ఈ శ్మశానంలోకి వాళ్ల తండ్రి శవాన్ని తీసుకువచ్చిన కృష్ణారావుగారు మీకు తెలుసా!?'' అంటూ ఉత్సుకతతో అడిగాడు.

''ఏ కృష్ణారావు! మా బలగంలో చాలామంది కృష్ణా రావులు ఉన్నారు. అతని కాంటాక్ట్ నెంబర్ ఏమైనా ఉందా?'' అడిగాడు వెంకట్రావు.

''ఉందండీ!'' అంటూ.. సెల్‌ఫోన్‌లో ఉన్న నెంబర్ వెతికి, వెంకట్రావుకు ఇచ్చాడు.



'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో విశిష్ట బహుమతి పొందిన కథ.

వెంకట్రావు మరో ఆలోచన లేకుండా ఆ నెంబర్ మీద క్లిక్ చేశాడు. కృష్ణారావు ఫోన్ రింగ్ అవుతున్న శబ్దం ఇద్ద రికీ వినిపిస్తున్నది.

కృష్ణారావు తన చాంబర్‌లో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లతో ముఖ్యమైన సమస్యలపై మీటింగ్ నిర్వహిస్తున్నపుడు.. తనకు అజ్ఞాత నెంబర్ నుంచి ఫోన్ రావడం ఆశ్చర్యంగా అనిపించింది. చిరాకుతో కూడిన కోపంతో కట్ చేద్దామ నుకున్నాడు. కానీ, అప్రయత్నంగానే లిఫ్ట్ చేశాడు.

''హలో సర్!'' అన్నాడు అవతల నుంచి వెంకట్రావు.

''ఎవరు? ఏం కావాలి?'' అంటూ తీవ్రస్వరంతో, కటువుగా అన్నాడు కృష్ణారావు.

''నేను వెంకట్రావును. మా మేనత్త చనిపోయింది.. మన కులస్థులందరికీ చెబుతున్నాను'' తగ్గ స్వరంతో అన్నాడు వెంకట్రావు.

''సిటీలో ఉన్న మీ వర్గీయులందరికీ చెబుతున్నారా? అయినా నా నెంబర్ ఎవరిచ్చారు?'' గద్దిస్తూ అడిగాడు కృష్ణారావు.

''మహాప్రస్థానంలో సూపర్‌వైజర్ శివానందం ఇచ్చాడు. అతని ఫోన్ నుంచే మాట్లాడుతున్నాను''.. సంజాయిషీ ఇచ్చుకొన్నట్టు చెప్పాడు వెంకట్రావు.

''శ్మశానంలో పనిచేసే వాడికి బుద్ధిలేకున్నా.. మీకైనా ఉండాలి. ముందు ఫోన్ పెట్టేయి!'' అంటూ కట్ చేశాడు కృష్ణారావు.

కృష్ణారావు మాటలను స్పీకర్‌లో విన్న శివానందం వణికిపోతూ, మొహం తేలేసుకొని నిలబడ్డాడు.

''నేను అతనితో మాట్లాడేముందు అతను ఎవరు? ఏ హోదాలో ఉన్నారు? ఆ విషయం అడగడం మరచి పోయాను. నువ్వు ఫోన్ కలిపి ఇవ్వగానే మాట్లాడాను. విన్నావుగా.. అతను ఎంత కోపంగా మాట్లాడాడో!'' అన్నాడు వెంకట్రావు.

''ఆయన చాలా పెద్దహోదాలో ఉన్న వ్యక్తి అని మాత్రం తెలుసు. కానీ, మంచివారు. ఇలా ఎలా మాట్లా డారో అర్థం కావడం లేదు. నాదే తప్పు! క్షమించండి!'' అంటూ, వెంకట్రావుకు దగ్గరగా జరిగి, బతిమాలుతూ అన్నాడు శివానందం.

''మా అత్త చనిపోయిన సమాచారం రాత్రి నుంచి చాలామందికి అందించాను. నువ్వు ఫోన్ ఇచ్చినప్పుడు కూడా అదే విషయం చెప్పాను. ఆయన ఇలా రియాక్ట్ అవుతాడని అనుకోలేదు. అయినా అతనితో నాకేం పని! సరే పద.. దహనం చేసిన తర్వాత త్వరగా ఇంటికి వెళ్లాలి'' అంటూ శివానందాన్ని తీసుకొని ప్లాట్‌ఫాం దగ్గరికి వెళ్లాడు.

వెంకట్రావుకు తగిన సహాయం అందించి.. వాళ్లం దర్నీ పంపించాడు శివానందం. మహాప్రస్థానానికి దగ్గర్లో ఉన్న తన ఇంటికి వెళ్లిన శివానందం.. ఫ్రెష్‌గా స్నానం చేశాడు. కానీ, అతని మనసు మనసులో లేదు. ఆలోచన లన్నీ పొద్దున జరిగిన సంఘటన చుట్టే తిరుగుతున్నాయి.

కృష్ణారావు.. తనకెంతో ఆప్తుడిలా భావించిన వ్యక్తి. ఈ రోజు అలా అసహనం ప్రదర్శించినందుకు మనసు గందరగోళంగా ఉంది. శివానందం మనసులో అనేక ఆలోచనలు రేకెత్తుతున్నాయి.

'బహుశా శ్మశానంలో పనిచేస్తున్న వ్యక్తితో మాట్లా డితే.. నేను స్నేహంగా భావిస్తాడని అనుకున్నాడేమో? ఏదైనా ఉద్యోగం ఇమ్మని పట్టుపడతాడని కావచ్చు. లేక అవసరాలకు డబ్బు ఇమ్మంటూ వెంటబడతానని అనుకు న్నాడేమో? ఫలానా హోదాలో ఉన్న వ్యక్తి నాకు చాలా దగ్గర అని చెప్పి.. ఇతరులను ఏ రకంగానైనా మోసం చేస్తానేమోనని అనుకున్నాడేమో? ఆ అనుమానంతోనే కసురుకున్నాడు కావచ్చు!'..

కృష్ణారావు మాట్లాడిన ఒక్క విదిలింపు మాటలో.. శివానందం మనసులో ఇన్ని అర్థాలు చోటు చేసుకొంటు న్నాయి. పెద్ద హోదాలో ఉన్న వ్యక్తికి, పరాయి వ్యక్తితో ఫోన్ చేయించినందుకు తనను తాను తిట్టుకున్నాడు. చితి మీద రగిలిన శవానికి కపాలమోక్షం కలిగినట్టుగా.. శివానందం బుర్రలో ఒక ఆలోచన మెరిసింది.

సార్‌కు తానే ఫోన్ చేసి, మధ్యాహ్నం జరిగిన సంఘ టనకు క్షమించమని అడుగుదామని అనుకున్నాడు. కానీ, ధైర్యం చాలడం లేదు, మాట్లాడందే మనసు నిలకడగా ఉండటంలేదు. గోడకున్న గడియారంవైపు చూశాడు. సాయంత్రం ఏడు గంటలు అవుతున్నది. ఈ సమయంలో ఫోన్ చేస్తే.. సార్ మళ్లీ సీరియస్ అవుతాడే మోనని భయం వేసింది. కానీ, చేయాలనే కోరిక